

కన్నుల పండువగా పద్మనాభుని దీపోత్సవం

● జిల్లా నుంచి అధికంగా హాజరు



6లో

మెట్లపై దీపారాధనలో భక్తులు

మాతృభాషలోనే మాట్లాడండి

● సాంఘిక దురాచారాలను అరికట్టేలా గురజాడ రచనలు

● సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ

తెలుగు భాష సజీవంగా ఉండాలంటే తెలుగు ప్రజలంతా మాతృభాషలోనే మాట్లాడాలని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ (ఎన్‌వీ రమణ) అన్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే మేధావులు అవుతారని అనుకోవడం తప్పని చెప్పారు. మాతృభాషను సంపూర్ణంగా నేర్చుకోకుండా పరాయి భాషపై ఏవిధంగా పట్టు సాధిస్తాడని ప్రశ్నించారు. మాతృభాషలో మాట్లాడితేనే మెదడు చురుగ్గా పని చేస్తున్నట్లు కొన్ని పరిశోధనల్లో తేలిందన్నారు. విజయనగరంలోని ఆనంద గజపతిరాజు ఆడిటోరియంలో శనివారం జరిగిన గురజాడ విశిష్ట పురస్కార ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పురస్కార గ్రహీత, రచయిత, దర్శకుడు మీగడ రామలింగస్వామికి పురస్కారాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మహాకవి గురజాడ రచనలు నేటికీ సజీవమని అన్నారు. గురజాడ విశిష్ట పురస్కార గ్రహీత మీగడ రామలింగస్వామి మాట్లాడుతూ ఈ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గురజాడ రచనలు సమాజ చైతన్యానికి దోహదపడ్డాయని చెప్పారు.

మీగడ రామలింగస్వామికి పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎన్‌వీ రమణ





జస్టిస్ ఎన్‌వీ రమణ దంపతులకు పైడితల్లి అమ్మవారి ఫొటోను అందజేస్తున్న దృశ్యం

6లో

హైవేపై శోకం



ప్రమాద ఘటన ఊహా చిత్రం



కారును క్రేన్ సాయంతో పక్కకు తొలగిస్తున్న పోలీసులు

మేనమామను తీసుకుని వచ్చేందుకు ఒకరు.. భార్యకు బ్యాంకు పరీక్ష ఉండడంతో బయల్దేరిన దంపతులు.. వీరిని కారులో తీసుకుని డ్రైవింగ్ చేస్తూ మరొకరు..! దాదాపు నలభై నిమిషాలు గడిచింది. రోడ్డుపై చిన్నగా పారుతున్న వర్షపునీరు అడ్డొస్తోంది. అయితే త్వరగా గమ్యం చేరాలన్న ఆత్రుత..! కారు డ్రైవరు వేగం పెంచాడు. అంతే.. క్షణాల్లో ఘోరం జరిగిపోయింది. జాతీయ రహదారి రక్తమోడింది. నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. కారు నుజ్జునుజ్జయి.. అందులోనే మృతదేహాలు ఇరుక్కుని.. భీతావహంగా కనిపించింది ఆప్రాంతం. కారు డివైడర్‌ను తాకి టైరు పంక్చరై.. డివైడర్‌పైకి ఎక్కి.. జాతీయరహదారిపై అటువైపునకు పోయి.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి సమీపాన హైవేపై శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో శ్రీకాకుళానికి చెందిన గౌడి వెంకటరమణ కౌశిక్ (27), మెడి జయేశ్(20), వడ్డి మణిబాల(24), వడ్డి అభినవ్(27) దుర్మరణం చెందారు. లారీ డ్రైవర్ రాజ్‌ఖాన్‌కు తీవ్రగాయాలయ్యాయి.

- అతివేగం.. వర్షపునీరు.. క్షణాల్లో దారుణం
- టైరు పంక్చరై డివైడర్‌ను ఢీకొట్టి ఆవలివైపునకు..
- ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న కారు
- 30 అడుగులు ఈడ్చుకుని పోయి ఆగిన లారీ
- కారులోనే.. అక్కడికక్కడే నలుగురి మృతి
- అందరూ శ్రీకాకుళం నగర వాసులే..
- భోగాపురం మండలం పోలిపల్లి వద్ద ఘటన
- మృతుల్లో దంపతులు.. వీరికి రెండేళ్ల కొడుకు



గౌడి కౌశిక్ (ఫైల్) | వడ్డి అభినవ్, భార్య మణిమాల (ఫైల్) | కారు డ్రైవర్ జయేశ్ (ఫైల్)

భోగాపురం/శ్రీకాకుళం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):


శ్రీకాకుళం నగరానికి చెందిన లంక బావాజీనాయుడు మనవడికి డిసెంబరు 6న వివాహం జరగనుంది. ఈ పెళ్లికి హాజరయ్యేందుకు అమెరికాలో ఉంటున్న బావాజీ నాయుడు కుమారుడు బాలాజీ శనివారం విమానంలో విశాఖపట్నం వస్తున్నారు. ఆయనకు స్వాగతం పలికి శ్రీకాకుళం తీసుకువచ్చేందుకు బాలాజీ మేనల్లుడు గౌడి కౌశిక్ తన ఫార్చ్యూనర్ కారులో డ్రైవర్ జయేశ్‌తో కలిసి విశాఖపట్నం బయలు దేరారు. కాగా.. కారులో విశాఖ వెళ్తున్నానని మిత్రుడు వడ్డి అభినవ్‌కు శుక్రవారమే కౌశిక్ చెప్పాడు. తన భార్యకు విశాఖలో బ్యాంకు పరీక్ష ఉందని.. తాము కూడా శనివారం కారులో వచ్చేస్తామని అభినవ్ తెలిపాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం కౌశిక్, వడ్డి అభినవ్, ఆయన సతీమణి మణిమాల విశాఖ బయలుదేరారు. గమ్యం తొందరగా చేరుకోవాలని వేగంగా వెళ్తున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి సమీపానికి వచ్చాక రోడ్డుపై వర్షపునీరు (మిగతా 8వ పేజీలో..)

సీసీ కెమెరాలో నిక్షిప్తమై..

ఘటనా స్థలం సమీపంలో పెట్రోల్ బంక్ ఉంది. ఇక్కడ సీసీ కెమెరాలు అమర్చారు. ఉదయం 8 గంటలు దాటిన తర్వాత ప్రమాదం జరిగినట్లు దృశ్యాలు ఇందులో నిక్షిప్తమయ్యాయి. కారు వేగంగా రావడం.. డివైడర్‌ను ఆనుకుని వెళ్లడం.. ఆవెంటనే డివైడర్‌ను ఆవలివైపునకు వెళ్లి లారీని ఢీకొట్టడం.. కారును లారీ దాదాపు 30 అడుగుల దూరం ఈడ్చుకుని పోవడం.. ఇవన్నీ అందులో రికార్డయ్యాయి. ఈ సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.



1. డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు అవతలకు వెళ్తూ..



2. ఆవలివైపు ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టి..

ఏడాది క్రితమే వివాహం..

గౌడి కౌశిక్.. శ్రీకాకుళంలోని పేర్లవారి వీధిలో బంగార ఆభరణాల వ్యాపారాన్ని తండ్రి వాసుదేవరావుతో కలసి చూసుకుంటున్నారు. కౌశిక్ అందరితో కలివిడిగా ఉంటూ మంచిపేరు సంపాదించుకున్నారు. ఏడాది క్రితం కౌశిక్‌కు వివాహమైంది. అత్తవారు కూడా బంగారు వర్తకులే. కౌశిక్ మృతి చెందిన వార్త తెలుసుకుని ఆ రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

అప్పుడు తండ్రి.. ఇప్పుడు తాను..

కారు డ్రైవర్ మెడి జయేశ్ తండ్రి చాన్నాళ్ల కిందట ఓ ప్రమాదంలో మృతి చెందారు. అప్పటినుంచి తల్లి.. నగరంలో సున్నపువీధిలో టీస్టాల్ నిర్వహిస్తూ జయేశ్‌ను పెంచింది. ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో జయేశ్ కూడా మృతి చెందడంతో ఆమె రోదన వర్ణనాతీతం

భార్య పరీక్ష కోసం తోడుగావెళ్లి..

కౌశిక్ మిత్రుడు అభినవ్. శ్రీకాకుళంలో లియో మెడికల్స్ ల్యాబ్‌ను తన తండ్రి వడ్డి మన్మథతోపాటు అభినవ్ చూసుకుంటున్నారు. భార్య మణిమాల విశాఖలో పరీక్ష రాసేందుకు వెళ్తుండటంతో స్నేహితుడి కారులో అభినవ్, తన భార్యతో కలిసి బయలుదేరారు. ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. అభినవ్‌కు మూడేళ్ల కిందట వివాహం అయింది. వీరికి రెండేళ్ల వయసున్న కొడుకు ఉన్నాడు. దంపతులిద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రమాద ఘటనకు చేరుకున్నారు.

రైతన్న కన్నీరు

● చివరి దశలో వరి పంట నీటి పాలు

విజయనగరం/ కలెక్టరేట్/ భోగాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో జిల్లాలో రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్రంగా కలవరపడుతున్నారు. పంటను రక్షించుకునేందుకు ఎంతో శ్రమించినా కొన్నిచోట్ల అపాయం తప్పలేదు. పంట నీటిపాలైన చోట తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా కష్టపడి పండించుకున్న పంట పోతుందేమోనని భయపడుతున్నారు. కొంతమంది రైతులు ముందుజాగ్రత్తల్లో భాగంగా పంటను మిల్లులకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా 2.40 లక్షల విస్తీర్ణంలో వరిని పండిస్తున్నారు. ఇప్పటి వరకు 63 శాతం వరికోతలు పూర్తయ్యాయి. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మిగిలిన 37 శాతం మంది వరికోతలు చేపట్టలేదు. వర్షాలకు ఈ రెండు రకాల రైతులు ఇబ్బంది పడుతున్నారు. తీర ప్రాంత గ్రామాలైన ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు గ్రామాల్లో మత్స్యకారులు ఎవరూ వేటకెళ్లలేదు. వలలు భద్రపర్చుకునేందుకు సరైన సౌకర్యంలేక తీరంలో వదిలేశారు.

● జిల్లాలో 60,900 హెక్టార్లలో వరి కోతలు పూర్తి చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 50,852 హెక్టార్లలో పంట కుప్పలు రూపంలో ఉంది. 10,084 హెక్టార్ల పంటకు నూర్పులు వేశారు. 31,223 మెట్రిక్ టన్నులను అధికారులు సేకరించారు. మిగిలిన 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడిస్తున్నారు.



డెంకాడ మండలం చింతలవలసలో వర్షానికి తడిచిన వరి కంకులు



భోగాపురం మండలం ముక్కాం తీరంలో ఉంచిన వలలు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్

● బెల్టు షాపులపై కఠిన చర్యలు ● గంజాయి నివారణకు 'ఈగల్'

● వేసవిలో తాగునీటికి ముందస్తు ప్రణాళిక: మంత్రి అనిత

విజయనగరం/ కలెక్టరేట్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి త్వరలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని హోం మంత్రి, ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ఆమె జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, వీటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్రీహోల్డ్ పట్టాలకు సంబంధించి సుమారు 490 ఎకరాల వరకూ అవకతవకలు జరిగినట్లు తేలిందని, బాధ్యులైన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. బెల్టుషాపులు ఎక్కడా లేకుండా ఎక్సైజ్ అధికారులు చూడాలన్నారు. వచ్చే వేసవిలో తాగునీరు సమస్య రాకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ తయారు చేసుకోవాలన్నారు. ధాన్యం తడవడం ద్వారా రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబరు 1912కు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న రహదారులకు మరమ్మతులు వేగంగా నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి సాగు, రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, దీనిలో భాగంగా ఈగల్ టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేశామని, త్వరలో ప్రతి జిల్లాలో ఈగల్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

● ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో నిర్ణీత గడువులోగా పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే కేటాయింపులను రద్దు చేయాల్సి ఉంటుందని మంత్రి శ్రీనివాస్ చెప్పారు. త్వరలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌ను పరిశీలించి కేటాయింపులపై సమీక్షిస్తామన్నారు. విద్యుత్ శాఖలో ఏఈలు, లైన్‌మెన్ల ఖాళీల కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. జిల్లాలో క్రీడా పాఠశాల మంజూరు అయ్యిందని, దీనిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలుకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ అంబేడ్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, పెనుమత్స సూర్యనారాయణ రాజు, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, బేబీనాయన, లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, ఎస్పి వకుల్‌జిందాల్, జేసీ సేతు మాధవన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిస్థితులపై సమీక్షిస్తున్న ఇన్‌చార్జి మంత్రి అనిత

ముంచేసిన ఫెంగల్

- జిల్లా వ్యాప్తంగా వర్షం
- పొలాల్లో నిలుస్తున్న నీరు
- మునిగిన వరి చేలు
- కాపాడుకోవడానికి రైతుల కష్టాలు


మెంటాడ: జీటీపేటలో తడిసిన వరిని కాపాడుకుంటున్న రైతు

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మాదిరి వర్షం పడుతోంది. పొలాల్లోకి నీరు చేరుతోంది. కొన్ని చోట్ల ఇప్పటికే వరి చేలు నీట మునిగాయి. దీంతో అన్నదాతలు అవస్థలు పడుతు న్నారు. ఇప్పటికే వరి పంటను కోసి పొలాల్లో వదిలిన రైతులు... దాన్ని కాపాడుకోవడానికి కష్టాలు పడుతున్నారు. వరిచేలను కుప్పలుగా పోసి పరదాలు కప్పుకుంటున్నారు. కానీ అంతగా ప్రయోజనం ఉండడం లేదు. కొన్నిచోట్ల నూర్పులు పూర్తయినా... ఇళ్లకు తరలించక పోవడంతో కష్టాలు తప్పడం లేదు. నూర్చిన ధాన్యంపై కళ్లాల్లోనే పరదాలు కప్పుతున్నారు. కుటుంబాలతో కలసి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అల్పపీడనం ప్రభావం వల్ల వరి పంటకు ఎటువంటి నష్టం లేదని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ చెప్పారు. అల్పపీడనం ప్రభావం ఉంటుందని ముందుగానే రైతులకు చెప్పడంతో కోచిన వరిచేను పొలాల్లో భద్రపరుచుకు న్నారని వివరించారు. మొక్క జొన్న పంటకు మాత్రం ఈ వర్షాలు ఉపయోగపడుతున్నాయని రైతులు చెబుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


బొబ్బిలి రూరల్: ధాన్యపు రాశులపై పరదాలు కప్పుతున్న దృశ్యం


రాజాం రూరల్: పాగిరిలో ధాన్యాన్ని భద్రపరుస్తున్న రైతులు


వర్షానికి తడిసిన పత్తి పంట


రాజాం: వరి కుప్పలపై పరదాలు కప్పుతున్న దృశ్యం


వరిచేనును కోత కోసి పొలంలోనే వదిలేసిన రైతు


సాలూరు రూరల్: పాచిపెంట మండలం గడివలస వద్ద వర్షానికి నేలకు వాలిన చేను


బొబ్బిలి రూరల్: వర్షంలో ట్రాక్టర్లపై మిల్లుకు ధాన్యం తరలిస్తున్న వైనం


జీగిరాం వద్ద ధాన్యం తడిసిపోకుండా పరదాలు కప్పుతున్న రైతులు


రాజాం రూరల్: వి.ఆర్.అగ్రహారం ప్రాంతంలో పొలంలోనే కోసిన వరి

కన్నుల పండువగా పద్మనాభుని దీపోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు


మెట్లపై దీపాల కాంతులు


గిరి మెట్లపై దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పద్మనాభం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని దీపోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. ఏటా కార్తీక అమావాస్య రోజున నిర్వహించే ఈ ఉత్సవాన్ని శనివారం అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు వేకువ జాము నుంచి పద్మనాభం చేరుకున్నారు. అనంతుని గిరి ప్రథమ పావంచా వద్ద పూజలు చేసి... అనంతరం మెట్లకు పసుపు, కుంకుమ బొట్లు పెట్టుకుంటూ వెళ్లారు. సాయంత్రం వేళ రాలేమని భావించిన పలువురు ఉదయాన్నే మెట్లపై దీపాలను వెలిగించారు. కొండపై పద్మనాభుని ఆలయం పునర్నిర్మాణ దశలో ఉండడంతో దేవస్థానం ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉదయం ఐదు గంటల నుంచే అందుబాటులో ఉంచి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం నాలుగు సమయంలో కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవీ సమేత అనంత పద్మనాభుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై నిలిపారు. తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం బృందాల ప్రదర్శనల నడుమ, వేద పండితుల మంత్రోచ్చారణలతో ఊరేగింపుగా ప్రథమ పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ గరుడ వాహనంపై స్వామి వారిని నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారికి పూజలు చేశారు. ప్రథమ పావంచాల వద్ద జేగంట కొట్టగానే భక్తులు అప్పటికే మెట్లపై సిద్ధం చేసుకున్న దీపాలను వెలిగించారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం దేదీప్యమానంగా మారింది. ఉత్సవం సందర్భంగా పద్మనాభం సామాజిక వేదిక వద్ద రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన అల్పాహారం, మజ్జిగ పంపిణీ స్టాల్‌ను భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్ ప్రారంభించారు. లా అండ్ ఆర్డర్ డీసీపీ అజిత ఆధ్వర్యంలో నార్త్‌జోన్ ఏసీపీ అప్పలరాజు, సీసీఎస్ ఏసీపీ లక్ష్మణరావు, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు ఆధ్వర్యంలో సుమారు 600 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.

మాతృభాషలోనే మాట్లాడండి

- పరభాషా వ్యామోహం వీడండి
- సంఘ సంస్కర్త గురజాడ
- సాంఘిక దురాచారాలను అరికట్టేలా ఆయన రచనలు
- సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ




విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష సజీవంగా ఉండాలంటే తెలుగు ప్రజలంతా మాతృభాషలోనే మాట్లాడాలని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ (ఎన్‌వీ రమణ) అన్నారు. పరభాష వ్యామోహంలో పడి మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మహాకవి గురజాడ వెంకట అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని విజయనగరంలోని ఆనంద గజపతిరాజు ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన గురజాడ విశిష్ట పురస్కార ప్రదానోత్సవానికి జస్టిస్ ఎన్‌వీ రమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పురస్కార గ్రహీత, రచయిత, దర్శకుడు మీగడ రామలింగస్వామికి పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాకవి గురజాడ రచనలు నేటికి సజీవమని అన్నారు. నాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు 'కన్యాశుల్కం' సజీవ సాక్ష్యమని తెలిపారు. వందేళ్ల క్రితం ఆయన ప్రస్తావించిన సమస్యలు నేటికి మిగిలే ఉన్నాయన్నారు. నాడు ఒక గిరీశమే ఉంటే, నేడు వందలాది మంది గిరీశాలు పుట్టుకొచ్చారన్నారు. పోలీస్, న్యాయ వ్యవస్థల్లో లోపాలను, కుళ్లిన సమాజాన్ని నాడు తన కన్యాశుల్కంలో ఎత్తి చూపారని గుర్తు చేశారు. బ్రిటీష్ న్యాయ వ్యవస్థను ఆయన ఆక్షేపించారని, నాటి సమాజంలో సాంఘిక దురాచారాలను, ఇతరత్రా అసమానతలను తొలగించేందుకు తన రచనలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన సంఘ సంస్కర్త గురజాడ అని చెప్పారు.

తెలుగు భాషపై నిర్లక్ష్యం తగదు..

పరభాష వ్యామోహంలో పడి మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదని జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. ప్రస్తుతం తెలుగు భాషపై తీవ్ర నిర్లక్ష్యం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భాష అంతరించిపోకుండా ఉండాలంటే పాలన అంతా తెలుగులోనే సాగాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మిత్రుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పిన చేప, పిల్ల కోతి కథను చెప్పి ఆహూతులను ఆలోచింపజేశారు. తెలుగు భాషను సజీవంగా ఉంచాలన్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే మేధావులు అవుతారు అనుకోవడం తప్పని అన్నారు. మాతృభాషను నేర్చుకోని, పరిపూర్ణత కాలేని వ్యక్తి పరాయి భాషపై ఏవిధంగా పట్టు సాధిస్తాడని ప్రశ్నించారు. కొన్ని పరిశోధనల్లో మాతృభాషలో మాట్లాడితేనే మెదడు చురుగ్గా పని చేస్తున్నట్లు తేలిందన్నారు. సమాజాభివృద్ధిలో మాతృభాష కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. తెలుగు భాష సజీవంగా ఉండాలంటే తెలుగు ప్రజలు మాతృభాషలోనే మాట్లాడాలని ఆయన సూచించారు. భాష, సంస్కృతులు అంతరించిపోకూడదన్నారు. తెలుగు భాషకు పరిపుష్టత లభించాలంటే కోర్టుల తీర్పులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే సాగాలన్నారు. తల్లిదండ్రులకు ఆంగ్ల మాధ్యమంపై భ్రమలు తొలగిపోవాలని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు శతక సాహిత్యాల విశిష్టతను వివరించాలని ఆయన సూచించారు.

కేసును ఉపసంహరించుకోవాలి..

గతంలో ప్రభుత్వం పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ జీవో జారీ చేయడం దురదృష్టకరమని అన్నారు. ఆ కేసును హైకోర్టు కొట్టివేసినా, సుప్రీం కోర్టుకు వెళ్లారని గుర్తు చేశారు. తెలుగు భాషను రక్షించేందుకైనా రాష్ట్ర ప్రభుత్వం ఆ కేసును ఉపసంహరించుకోవాలన్నారు. తెలుగు భాషకు గౌరవం లభించే విధంగా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కృషి చేయాలని జస్టిస్ ఎన్.వి.రమణ కోరారు.

తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి..

తెలుగు వారికి ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే గౌరవప్రదంగా ఉంటుందన్నారు. తెలుగు ప్రజలు గర్వించే విధంగా రాష్ట్ర రాజధాని ప్రాంతం అమరావతిలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు. వివిధ ప్రాంతాల్లో తెలుగు మాండలికాలు సజీవంగా ఉండాలంటే భాషా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు.



పైడిమాంబ దర్శనం..

జిల్లా కేంద్రానికి విచ్చేసిన జస్టిస్ ఎన్‌వీ రమణ ముందుగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లమ్మను దర్శించుకున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్ తదితరులు స్వాగతం తెలిపారు.

ఆనందంగా ఉంది..

మహాకవి పేరున ఉన్న గురజాడ విశిష్ట పురస్కారాన్ని దేశ అత్యున్నత వ్యక్తుల్లో ఒకరైన సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందని మీగడ రామలింగ స్వామి అన్నారు. 50 ఏళ్ల క్రితం విజయనగరంలో విద్యనభ్యసించానని, గురజాడ సాంస్కృతిక సమాఖ్య రజతోత్సవానికి ముందుగా ఈ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. గురజాడ రచనలు సమాజ చైతన్యానికి దోహద పడ్డాయన్నారు.

సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన జస్టిస్ ఎన్‌వీ రమణ



పురస్కార గ్రహీత మీగడ రామలింగ స్వామి గురజాడ రచనల్లోని పద్యాలు ఆలపించడం... తెలుగు భాష, సంస్కృతి గురించి మాట్లాడడం చూసి జస్టిస్ ఎన్‌వీ రమణ ఆనందపడ్డారు. తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేశారు. అనంతరం రామలింగస్వామితో మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు, విజయనగరం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్‌వీ రమణ, శివబాల దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం మానాపురం చంద్రశేఖర్, ఇందిరావెల్లి, జీఎల్‌ఎం శాస్త్రి, సత్యముని నవీన్, మీసాల చిన గౌరునాయుడు, కె.పద్మజా శంకర్, ఎస్.నరేంద్రబాబుకు గురజాడ పురస్కారాలు, డాక్టర్ కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణ మూర్తి, కుసుమంచి శ్రీదేవి సురేష్‌లకు కవితా పురస్కారాలు అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి సాయి కళ్యాణ చక్రవర్తి, నగర డిప్యూటీ మేయర్ కె.శ్రావణి, గురజాడ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్, డాక్టర్ వెంకటేశ్వరరావు, సన్‌స్కూల్ అధినేత అనీల్‌కుమార్, మేకా అనంతలక్ష్మి, గురజాడ వారసులు ఇందిరా ప్రసాద్, వారి కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ

- ఉదయం 5.30 గంటల నుంచే ప్రారంభం
- ఆస్పత్రులకు వెళ్లి అందజేసిన వైనం
- గిరి శిఖర గ్రామాల్లోనూ అదే తీరు


సాలూరు రూరల్: ఎగువ కొరియాలో జోరువానలో పింఛను అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మధుబాల


సాలూరు రూరల్: ఎగువ శెంబిలో పింఛను అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీను

సాలూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓవైపు వర్షం...మరోవైపు చలి... ఈ రెండింటినీ లెక్క చేయకుండా అధికార యంత్రాంగం పింఛన్లు పంపిణీ చేశారు. సాలూరు మండలంలో 8,306 పింఛన్లకు గాను 7,657 పంపిణీ చేశారు. జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ గిరిశిఖరాల్లో ఉన్న కొదమ, పట్టుచెన్నూరు, పగులుచెన్నూరు, మారయ్యపాడు, కొరియా గ్రూప్ గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసు, వ్యవసాయ సహాయకులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు వెళ్లి పింఛను సొమ్మును అందించారు. ఒకరోజు ముందుగానే పింఛను డబ్బులు అందడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తమ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతుందంటు హర్షం వ్యక్తం చేశారు.

వేకువజామునే...


గంట్యాడ: కొర్లాంలో ఉదయాన్నే పింఛను అందిస్తూ..

గంట్యాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం వర్షంలోనూ కొనసాగింది. ఉదయం 5.30 నుంచి అన్ని గ్రామాల్లో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పింఛను పంపిణీ చేశారు.

ఆస్పత్రిలో...


సీతంపేట రూరల్: విశాఖ కేజీహెచ్‌లో పింఛను అందిస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో విశాఖ కేజీహెచ్, రాగోలు జెమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పెద్దపొల్ల గ్రామానికి చెందిన ఆరిక లక్కాయి, ఆరిక కూర్మారావులకు సచివాలయ ఉద్యోగి అమల పింఛను అందజేశారు. దీంతో లబ్ధిదారులు ప్రభుత్వానికి, సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

హాస్పిటల్‌కి వెళ్లి..


విజయనగరం మహారాజా ఆసుపత్రిలో పింఛను పంపిణీ

బొబ్బిలి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కింతలివానిపేట గ్రామానికి చెందిన బొంతలకోటి సూర్యనారాయణ కొన్ని రోజులుగా అనారోగ్యంతో విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దిబ్బగుడ్డివలస సచివాలయ సిబ్బంది శనివారం విజయనగరం ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు. లబ్ధిదారుడితో పాటు ఎమ్మెల్యే బేబీనాయన సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

అంగన్‌వాడీ ఆయాను తొలగిస్తూ ఉత్తర్వులు

గజపతినగరం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తున్న మానాపురం సౌజన్యను విధులనుంచి తొలగిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఐసీడీఎస్ పీవో పి.నాగమణి శనివారం తెలిపారు. ఆయా సౌజన్య తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగం పొందినట్లు విచారణలో తేలినందున జిల్లా కలెక్టర్, పీడీ కార్యాలయంనుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆయా సౌజన్యను తొలగిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీగా విధులు నిర్వ హిస్తున్న రమణమ్మకు ఆయా నుంచి చార్జి తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఉపాధి ఫీడర్ చానల్ పనుల పరిశీలన

బొండపల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి ఫీడర్ ఛానల్ పనులను శనివారం ఎంపీడీవో జి.గిరిబాల పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు మస్తర్లను పరిశీలించారు. గ్రామాల్లో రైతులకు అవసరమైన పనులను గుర్తించి చేపట్టాలని క్షేత్ర సహాయకునికి సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడంతో పాటు జాబ్ కార్డులు లేని వారికి జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఏపీవో బి.కృష్ణవేణి, ఏవో కే.తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక బహిరంగ వేలం పాట

డెంకాడ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): డెంకాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 67 కేసుల్లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తరలిస్తుండగా పట్టుబడిన సుమారు 104 యూనిట్ల ఇసుకను, డెంకాడ తహసీల్దార్ పద్మావతి సమక్షంలో శనివారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో పూసపాటిరేగ మండలం కొప్పెర్ల గ్రామానికి చెందిన సంకభక్తుల సత్తిబాబు 37500 రూపాయలకు చేజిక్కించుకున్నారని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. ఈ నగదును ప్రభుత్వ ఖజానాకు జమ చేశామన్నారు.

జూట్‌మిల్లును తెరిపించాలి

నెల్లిమర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జూట్‌మిల్లును తెరిపించేందుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టాలని ఇఫ్టూ యూనియన్ ప్రతినిధులు తివనాటి అప్పారావు, గంటా పాపారావు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. నెల్లిమర్ల పర్యటనకు శనివారం వచ్చిన మంత్రి శ్రీనివాస్‌ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. మిల్లు మూత వల్ల కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని మిల్లుతెరిచివేతకు చర్యలుచేపట్టాలని కోరారు.

విజేతలుగా తిరిగిరావాలి

విజయనగరం టౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని విజయనగరం నగర మేయర్ వి.విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 2 నుంచి 5 వరకు బీహార్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తన కార్యాలయంలో కలవగా వారిని అభినందించారు. జిల్లా ఫెన్సింగ్ కోచ్ డి.వి. చారి ప్రసాద్, అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రతిపాదిత అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

విజయనగరంరింగురోడ్డు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శనివారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలోని రూ.156.93 కోట్లతో ప్రతిపాదించిన అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. నగర మేయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. 10 కోట్లు సాధారణ నిధులతో కొత్త రోడ్లు వేయడానికి, మరో కోటి రూపాయిలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మాణం, 1.50 కోట్లతో హార్టి కల్చర్, పట్టణ సుందరికరణ కోసం బడ్జెట్లుతో కేటాయించారు. మరో కోటి రూపాయలతో సెంట్రల్ లైటింగ్ కోసం కోసం కేటాయించారు. నగర కమిషనర్ నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

నెల్లిమర్ల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని జీఎస్టీ అండ్ కస్టమ్స్ కమిషనర్ ఈదర రవికిరణ్ అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన యూజింగ్ టెక్నాలజీ అండ్ ఏఐ ఫర్ ఎఫెక్టివ్ లెర్నింగ్ అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం కాదని, లెర్నింగ్ ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఐక్యూ ఏసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, స్కిల్స్ డీన్ అనిల్‌కుమార్, ఆసిఫ్, దేవికారాణి పాటు బీటెక్, బీబీఏ విద్యార్థులున్నారు.

క్రీడా దుస్తుల వితరణ

వంగర,నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలో అరసాడ జడ్పీ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన లావేటి రాంబాబు క్రీడా దుస్తులు వితరణ చేశారు. ఇటీవల తన భార్య మృతి చెందడంతో ఆమె గుర్తుగా రూ.15000 విలువ చేసే దుస్తులు అందజేశారు. ప్రాధాన్యోపాధ్యాయులు జగదీశ్వరి, టీడీపీ నాయకులు కృష్ణమూర్తి, వెంకటనాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

లెండిలో జాతీయస్థాయి శిక్షణ

డెంకాడ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం జావా ఫుల్ స్టాక్, రియాక్ట్ జేఎస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై నేషనల్ లెవల్ షార్ట్ టర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రాం(ఎస్‌టీటీపీ)ని శనివారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్స్‌పాల్ రామారెడ్డి, రామారావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత కళాశాలగా పేరు తెచ్చుకోవాలి

- హోం మంత్రి వంగలపూడి అనిత
- 'సంకల్పం'పై అవగాహన సదస్సుకు హాజరు



సదస్సులో మాట్లాడుతున్న హోమ్ మంత్రి అనిత

నెల్లిమర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కళాశాల డ్రగ్స్ రహిత కళాశాలగా పేరు తెచ్చుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం, మిమ్స్ యాజమాన్యం సంయుక్త నిర్వహణలో మిమ్స్ వైద్య కళాశాలలో శనివారం సంకల్పం పేరుతో వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హోం మంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనమవుతుందనే విషయాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. గంజాయి తరహా మత్తు పదార్థాల వినియోగం, రవాణాలో ఏపీకి చెడ్డ పేరు ఉందని, ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాలు కేంద్ర బిందువులుగా మారాయన్నారు. మనిషి జీవితానికి విద్యార్థి దశే కీలకమని, ఈ దశలో దుర అలవాట్ల జోలికి పోకుండా కళాశాల యాజమాన్యాలు కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి పెంపకం, వినియోగం, అక్రమ రవాణాలపై ఉక్కు పాదం మోపేందుకు ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసి డిజి స్థాయి పోలీస్ అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించామని అన్నారు. విజయనగరం జిల్లాలో గంజాయి రవాణా, వినియోగం నివారించేందుకు ఎస్పీ వకుల్‌జిందాల్, సిబ్బంది 24 గంటలు కష్టించి పనిచేస్తున్నారని అభినందించారు. ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గంజాయి తరహా మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం ఎలా నాశనమవుతుందో విద్యార్థులకు వివరించాలన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు సంబంధించిన కేసుల్లో 713 మందిని అరెస్టు చేశామని వివరించారు. కార్యక్రమంలో మిమ్స్ వైద్య కళాశాల చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు, ఎంఎల్‌ఎ లోకం నాగమాధవి, మిమ్స్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్‌వర్మ, డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, ఎఎస్‌పి సౌమ్యలత, ఓఎస్‌డి అనిల్ పులిపాటి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈగల్ విభాగం వాహనాన్ని, డ్రాప్ బాక్స్‌ను హోంమంత్రి ప్రారంభించారు.

గురుదేవ ట్రస్టు సేవలు గొప్పవి

- సుప్రీంకోర్టు విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ



కృత్రిమ అవయవాల తయారీని పరిశీలన చేస్తున్న ఎన్‌వీ రమణ



రామానారాయణాన్ని సందర్శించిన జస్టిస్ ఎన్‌వీ రమణ

కొత్తవలస, నవంబరు30(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులపాలిట వరం గురుదేవ చారిటబుల్ ట్రస్టు అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని మంగళపాలెం గ్రామంలో ఉన్న గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన కృత్రిమ అవయవాల తయారీని స్వయంగా పరిశీలించారు. ఇప్పటి వరకు సుమారు లక్ష మంది వరకు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను తయారు చేసి అందించామని ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. చెవిటి, మూగ, అంధులకు అవసరమైన పరికరాలతో పాటు వీల్ చైర్ వంటివి కూడా అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం గురుదేవ ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవ చేయడమనేది ఒక అదృష్టమని, చాలామందికి సేవ చేయాలనే ఆశయం ఉన్నప్పటికీ సేవలు చేయలేరన్నారు. అనంతరం ఆయన చేతులు మీదుగా కృత్రిమ అవయవాల పంపిణీ చేశారు. కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సముద్రా విజయచందర్‌తో పాటు కొత్తవలస న్యాయవాద సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

రామనారాయణం సందర్శన

విజయనగరం(ఆంధ్రజ్యోతి): జస్టిస్ ఎన్‌వీ రమణ శనివారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా విజయనగరంలోని ప్రముఖ ఆధ్యాత్మి పర్యాటక కేంద్రం రామానారాయణాన్ని సందర్శించారు. ఆలయం ప్రాంగణంలో దేవతామూర్తుల విగ్రాహాలను, బొమ్మల కొలువును తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్.సీ.ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, జ్ఞాపికను అందచేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఆర్డీవో సత్యవాణి

చీపురుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని చీపురుపల్లి ఆర్డీవో బి. సత్యవాణి పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్, మానవీయత సంస్థలు సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాలు, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ లక్ష్య సాధన కోసం పని చేయాలన్నారు. మాదక ద్రవ్యాలు మనిషి జీవితా లను సర్వనాశనం చేస్తాయన్నారు. కౌమార దశలో ఉన్న వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్. రాఘవులు, ప్రభుత్వ వైద్యులు డా. కుమార్, రెడ్‌క్రాస్ సమన్వయకర్త బీవీ గోవిందరాజులు, మీసాల లక్ష్మణరావు, డోల నాగరాజు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ● చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ కౌన్సిలింగ్ సెంటరు ఇన్‌చార్జి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డా. పీవీ కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



వేపాడ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల

లక్కవరపుకోట, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలలలోని రైతులు అమ్ముతున్న ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం జమ్మాదేవిపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలో 8 కేంద్రాల ద్వారా ధాన్యాన్ని ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. మిల్లర్లు రైతులకు సహకరించాలని తేమ పేరుతో రైతులను వేధించవద్దని పేర్కొన్నారు. మాజీ జడ్పీటీసీ, ఎంపీపీలు కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో అప్పారావు, వ్యవసాయ అధికారి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: రైతు శ్రేయస్సు కోరి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ధాన్యం మద్దతు ధరను పెంచినట్టు శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి న్నారు. మండల కేంద్రం వేపాడలోని రైతు సేవా కేంద్రంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతు నుంచి ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేసేందుకు ముఖ్యమంత్రి అన్ని చర్య లు తీసుకుంటున్నారన్నారు. కొత్త రేషన్ కార్డులకు అభ్యర్థులు డిసెంబరు 2 నుండి దర ఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. మండల వ్యవసాయాధికారి యశ్వంతరావు తహసీల్దా ర్ రాములమ్మ, ఎంపీ డీవో సూర్యనారాయణ, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వార్షిక అంచనా బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం

జియ్యమ్మవలస, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌కు ఎంపీపీ బొంగు సురేష్ ఆధ్వర్యంలో సభ్యులు ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో శంబంగి రమేష్ ద్వారా కార్యాలయ పర్యవేక్షకుడు కొండగొర్రి రామారావు బడ్జెట్‌ను చదివి వినిపించారు. 2024-25 సవరణ బడ్జెట్‌లో ప్రారంభపు నిల్వ రూ.88.02 లక్షలతో పాటు ఆదాయం రూ.99.36 కోట్లు కలిపి మొత్తం రూ.100.24 కోట్లు. ఇందులో వ్యయం రూ.100 కోట్లు చూపగా అంత్య నిల్వ రూ.23.38 లక్షలుగా చూపారు. ఈ అంత్య నిల్వనే 2025-26 ఆర్థిక సంవత్సర ప్రారంభపు నిల్వగా చూపుతూ ఈ ఏడాదికి ఆదాయం రూ.109.80 కోట్లు కలిపి మొత్తం రూ.110.03 కోట్లుగా చూపారు. ఇందులో ఖర్చు రూ.110 కోట్లు చూపగా రూ.2,54,917 అంత్య నిల్వగా చూపారు. దీనిని ఎంపీటీసీ సభ్యులందరూ ఏకగ్రీవ ఆమోదం తెలపడంతో బడ్జెట్ ఖరారైందని ఎంపీడీవో రమేష్ ప్రకటించారు. ఈ సమావేశానికి వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కురుపాం మండలంలో..

కురుపాం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలానికి సంబంధించిన 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్‌ను ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2024-25 సవరణ బడ్జెట్లో ఆదాయానికి గాను పలు పథకాలు నిర్వహణ నిమిత్తం వ్యయం కేటాయిస్తూ సభ్యులు బడ్జెట్ ఆమోదించారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు గొర్లి సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షేక్ నిషార్, వైస్ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చదరపు గజాల్లోనే నష్టపరిహారం చెల్లించాలి



బాధితుల వాదనలు వింటున్న న్యాయాధికారి

కొత్తవలస, నవంబరు30(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే కారణంగా నష్టపోతున్న తమకు చదరపు గజాల్లో నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ ఉత్తరాపల్లి రెవెన్యూలో 'హ్యాపీ హోం' వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసుకున్న యజమానులు ప్రీలిటిగేషన్ కింద కొత్తవలస న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 1990 సంవత్సరంలో ఉత్తరాపల్లి రెవెన్యూ పరిధిలో వైల్డ్ వెస్టు హ్యాపీ హోం పేరుతో 300 ఎకరాల్లో వెంచర్ వేయగా వందలాది మంది ఈ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసుకున్నారు. తాజాగా వెంచర్‌లో నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయడంతో ప్లాట్లు కొనుగోలు చేసుకున్నవారికి సెంట్లలో నష్టపరిహారం చెల్లించడానికి హైవే అథారటీ ముందుకు వచ్చింది. అయితే కొంతమందికి చదరపు గజాల్లో నష్ట పరిహారం చెల్లించగా మరి కొంతమందికి మాత్రం సెంట్లలో నష్టపరిహారం చెల్లిస్తామని హైవే అథారిటీ తెలపడంతో బాధితులు కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జికోర్టులో న్యాయ సేవాసాధికారిత ద్వారా ప్రీ లిటిగేషన్ కింద పిటీషన్ పెట్టుకున్నారు. దీంతో న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయచందర్ నోటీసులతో శనివారం హైవే అథారిటీ డిప్యూటీ మేనేజర్ కిరణ్ కుమార్, సుమారు 60 మంది బాధితులు కోర్టుకు హాజరయ్యారు. ఇరువర్గాలకు చెందిన వాదనలు విన్న తరువాత తదుపరి విచారణను డిసెంబర్ 21 వతేదికి వాయిదా వేశారు.

మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశం

బెలగాం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపాల్టీ సమావేశం శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మొక్కుబడిగా సాగింది. అజెండా చదవకుండానే మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ సమావేశం ముగించారు. ముగ్గురు టీడీపీ కౌన్సిలర్లు వారి సమస్యలపై చైర్‌పర్సన్‌ను నిలదీశారు. కౌన్సిలర్ కోరాడ నారాయణరావు జగనన్న లేఅవుట్‌లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ద్వారపురెడ్డి శ్రీదేవి తాగునీటిపై ప్రశ్నించగా, ఇంకొక కౌన్సిలర్ తమ వార్డులో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఇలా కౌన్సిల్ సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాలూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ప్రతి నెల ఐదో తేదీలోపు జీతాలు చెల్లించాలని కోరారు. బకాయిలు ఉన్న జీతాలను విడుదల చేయాలని కోరారు. పట్టణలో శ్యామలాంబ పండుగ దృష్ట్యా అదనపు కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 15వ తేదీలోగా కార్మికులు సమస్యను పరిష్కారిస్తానని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ హామీ ఇవ్వటంతో కార్మికులు నిరసనను విరమించారు.

సాదాసీదాగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

సాలూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మున్సిపల్ అభివృద్ధి పనులకు సంబంధించి పాలకవర్గానికి తెలియకుండా ఎలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తారని పలువురు కౌన్సిలర్లు కమిషనర్‌ను ప్రశ్నించారు. పనులపై త్వరిత గతిన అంచనాలు వేసి, పంపాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అలా చేయాల్సి వచ్చిందని కమిషనర్ సత్యనారయణ తెలిపారు. సమావేశంలో పలువురు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష దీపారాధన



సాలూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగుస్తున్న నేపథ్యంలో శనివారం రాత్రి స్థానిక కామాక్షి ఆలయ ప్రాంగణంలో లక్ష దీపారాదన కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, దీపాలు వెలిగించారు. ఈసందర్భంగా ఏకామ్రనాథుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏకామ్ర నాథునికి, కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎవరో వస్తారని చూడకుండా..

- రహదారి బాగు చేసుకున్న రైతులు



సాలూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రైతులు రహదారి బాగు చేసుకున్నారు. యరగడవలస రోడ్డు నుంచి బూర్జి జంక్షన్ వరకు రోడ్డు గోతులమయం అయ్యింది. ఈ గోతుల కారణంగా నంద గ్రామానికి వెళ్లే బస్సు పలుసార్లు అక్కడ వరకు రాకుండా వెనుదిరుగుతోంది. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు పామాయిల్ తూకానికి ఉన్న కాటాకు ట్రాక్టర్లు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది. దీంతో రైతు బసవయ్య రైతులందరితో మాట్లాడి ఎక్స్‌వేటర్, ట్రాక్టర్లుతో శనివారం తమ రోడ్డును తామే బాగు చేసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య



పైడిరాజు (ఫైల్)

గజపతినగరం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన శీర పైడిరాజు(31) పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శీర పైడిరాజుకు కొత్తవలస మండలం రాయిబిల్లికి చెందిన బొబ్బిలి ఆదిలక్ష్మితో మూడేళ్ల కిందట వివాహమైంది. ఇతను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి అదే గ్రామానికి చెందిన వివాహితతో 8 నెలలుగా పరిచయం ఏర్పడింది. శుక్రవారం వీరిద్దరి మధ్య గొడవ జరగడంతో పైడిరాజు ఆటోతో గజపతినగరం రైల్వేస్టేషన్ పరిధిలో కొత్తగా నిర్మాణం చేపడుతున్న రైల్వేమూడో లైన్ దగ్గరికి చేరి పురుగు మందు తాగాడు. విషయం తెలిసిన వివాహిత కూడా అక్కడకు చేరుకుని ఆమె కూడా పురుగు మందు తాగడంతో ఇద్దరూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. గుర్తించిన స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పైడిరాజు శనివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి శీర అప్పలనాయుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

వేపాడ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి వల్లంపూడి ఎస్ఐ బి.దేవి అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కే.కోటపాడు మండలానికి చెందిన కొరువాడ గ్రామానికి చెందిన సింగంపల్లి రాము(57) వ్యక్తిగత పనులమీద మండలానికి వచ్చి కుమ్మపల్లి జంక్షన్ వద్ద నిలబడి ఉన్నాడు. కొత్తవలస నుంచి బైక్‌పై దేవరాపల్లి వెళ్తున్న వ్యక్తి ఆగి ఉన్న బస్సును తప్పించబోయి నిలబడి ఉన్న రాముని బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ఘటనలో రాము కింద పడ్డంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు రాముని వైజాగ్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాము మృతి చెందినట్టు ఎస్ఐ దేవి తెలిపారు. మృతుడు రాముకు భార్య కుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రామభద్రపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కె.పాలవలస గ్రామ సమీపంలో గల పొలంలో శనివారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో ఒక రైతు మృతిచెంది నట్టు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాడంగి మండలం గజరాయనివలస గ్రామానికి చెందిన నల్ల అప్పలనాయుడు(58) పొలంలో యూరియా వేస్తూ చేతులు కడుక్కుని పక్కనే ఉన్న షెడ్డు లో మోటారు వేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తర లించారు. భార్య సరోజిని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ..



మహేష్ (ఫైల్)

రామభద్రపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండకెంగువ గ్రామానికి చెందిన అంపావల్లి మహేష్(34) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. అయ్యప్పమాలలో ఉన్న మహేష్ తన స్నేహితుడు చైతన్యతో కలిసి బైక్‌పై రాజమండ్రి దగ్గర గల ద్వారపూడికి వెళ్తున్నారు. విశాఖపట్టణం దాటిన తర్వాత గురువారం రాత్రి కారు ఢీకొంది. దీంతో గాయాలపాలైన ఇద్దరినీ విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మహేష్ శనివారం మృతిచెందాడు. చైతన్య చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆటో ఢీకొని..

రాజాం రూరల్: ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన రాజాంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం- శ్రీకాకుళం రోడ్డులో శనివారం రాత్రి ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా రాజాం నుంచి పొందూరు వైపు వెళ్తున్న ఆటో ఢీకొంది. ఘటనలో ఆ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. రాజాం పోలీసులు మృతదేహాన్ని రాజం సామాజిక ఆసుపత్రికి తరలించారు.

సారాతో అనర్థం

విజయనగరం క్రైం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): సారా తాగితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.ఇందిరాదేవి అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ నెల్లిమర్ల మండలం అప్పయ్యపేట గ్రామంలో సారా, అక్రమ మద్యం రవాణాతో తలెత్తే పరిణామాలపై అవగాహన కల్పించారు. అక్రమ మద్యం రవాణా, సారా తయారీ, విక్రయం, సరఫరా చేసినా కేసులు నమోదు చేస్తామ న్నారు. హెచ్‌సీలు నాగేశ్వరరావు, రాంబాబు, కానిస్టేబుళ్లు రాము, నాయుడు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీలో అవినీతిపై విచారణ చేయాలి

గంట్యాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ అవినీతిపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని పాలరైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కొటారుబిల్లి కూడలిలో జిల్లా అధ్యక్షుడు లోకవరపు ఆదినారాయణతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల సేకరణ ధర లీటరుకు 3 నుంచి 4 రూపాయలు తగ్గించిందని, దీనివల్ల పాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. రైతుల నుంచి సేకరించిన పాలకు ధర తగ్గించి, వారు విక్రయించిన పాలకు మాత్రం ధర తగ్గించలేదన్నారు. ఆవు పాలు లీటరుకు కనీస ధర రూ 50, గేద పాలు ధర రూ 80 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 2న విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనికి రైతులు సహకరించాలని డిమాండ్ చేశారు.

నిజ నిర్ధారణ కమిటీ వేయాలి

గరుగుబిల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చినగుడబ రెవెన్యూ పరిధిలో ఉన్న ఏటీసీహెచ్‌ఏఎం మైనింగ్ క్వారీ పనులపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. క్వారీపై వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు అక్కడికి వస్తారని సమచారం తెలుసుకున్న కూటమి నాయకులు శనివారం ఆ క్వారీ వద్దకు ర్యాలీగా వెళ్లారు. అక్రమాలకు పాల్పడితే క్వారీ మైనింగ్ లైసెన్సును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు రాకపోవడంతో వెనుదిరిగారు. టీడీపీ నాయకులు అక్కేన మధుసూదనరావు, మరడాన తవిటినాయుడు మాట్లాడుతూ క్వారీ యాజమాన్యం తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువలోని నీటిని వాడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. సమీపంలోని చెరువులను ఆక్రమించినట్లు గుర్తించామన్నారు. ఈ పరిశీలనలో జనసేన నాయకులు అక్కేన శంకరరావు, లచ్చిపతుల రంజిత్‌కుమార్, పెంట శంకరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

రేపు చలో విశాఖ

సీతానగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు తగ్గించిన పాల ధర పెంచాలని కోరుతూ డిసెంబరు 2న విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్టు ఏపీ పాల రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి లక్ష్మంనాయుడు, కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల రైతులకు ఇస్తున్న రాయితీలతో పాటు పాల ధర పెంచాలని కోరుతూ చేపట్టనున్న చలో విశాఖ కార్యక్రమాన్ని పాడి రైతులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

హైవేపై ఘోరం

(ఐదో పేజీ తరువాయి)

కారణంగా డ్రైవరు కారును అదుపు చేయలేకపోయాడు. కారు డివైడర్‌ను తాకుతూ వెళ్లడంతో టైరు పంక్చర్ అయింది. క్షణాల్లో డివైడర్‌ను ఢీకొట్టి విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే జాతీయ రహదారిపైకి దూసుకుపోయింది. అదే సమయంలో విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వస్తున్న లారీని ఢీకొట్టింది. కారును లారీ 30 అడుగుల దూరం మేర ఈడ్చుకుంటూ పోయింది. దీంతో కారు నుజ్జునుజ్జుఅయింది. కారు డోర్లు తెరుచుకుని ఇద్దరి శరీరాలు నగం వరకు బయటపడ్డాయి. మరో ఇద్దరు కారులోనే చిక్కుకున్నారు. నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే లారీ డ్రైవర్ రాజ్‌ఖాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొంత సమయం ట్రాఫిక్ ఆగిపోయింది. విజయనగరం అడిషనల్ ఎస్పీ పి.సౌమ్యలత, సీఐ ఎస్వీ ప్రభాకర్, ఎస్ఐలు వి.పాపారావు, పి.సూర్యకుమారి ఘటనా స్థలానికి వచ్చారు. కారులో నుంచి మూడు మృతదేహాలను బయటికి తీశారు. అయితే కారు పైభాగాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగించి డ్రైవర్ మృతదేహాన్ని బయటికి తీయాల్సి వచ్చింది. అనంతరం నాలుగు మృతదేహాలను పోస్టుమార్టం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలం వద్ద జాతీయరహదారి రక్తమయమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు.

చేపల పెంపకంలో మధ్యవర్తులకు ఆస్కారం లేదు

● జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకురాలు నిర్మలకుమారి

బొబ్బిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చేపల పెంపకంలో మధ్యవర్తులకు ఎటువంటి ఆస్కారం లేదని జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకురాలు నిర్మలకుమారి స్పష్టం చేశారు. ఈనెల 29న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'చేప వారిది పెత్తనం వేరొకరిది' అనే కథనానికి ఆమె స్పందిస్తూ శనివారం వివరణ ఇచ్చారు. బొబ్బిలి డివిజన్ పరిధిలో 8 స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, వీటిలో సుమారు వెయ్యి మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. నీటి పారుదల శాఖకు చెందిన చెరువులను ప్రభుత్వం నుంచి తీసుకుని నామమాత్రపు లీజు సొమ్ముతో సహకార సంఘాలకు జీవనోపాధి నిమిత్తం లీజుకు ఇచ్చామని, చేపలను పెంచుకుంటూ మార్కెటింగ్ చేసుకుంటూ స్థానికంగానే నివాసం ఉంటున్నారన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద నాలుగు లక్షల చేపపిల్లలను సబ్సిడీపై సరఫరా చేశామని తెలిపారు. సహకార సంఘాల సభ్యులకు తాజా చేపలను అమ్ముకునేందుకు ద్విచక్రవాహనాలు, ఫిష్ ఆంధ్రా షాపులు, ఫిష్ కియాస్క్‌లను సబ్సిడీపై మంజూరు చేశామని చెప్పారు. పెట్టుబడి ఖర్చులను నామమాత్రపు వడ్డీతో కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



వసతి గృహ సిబ్బందితో మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విజయ్‌రాజ్ కుమార్

వంగర, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వసతి గృహంలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని లీగల్ కమిటీ చైర్మన్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విజయ్‌రాజ్ కుమార్ తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతిలో అన్నీ సమస్యలే శీర్షిక వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. సీతారాంపురం వసతి గృహానికి చేరుకుని తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ పై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడగా వారు పలు సమస్యలను ఆయనకు తెలపడంతో వెంటనే పరిష్కరించాలని వసతి గృహ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జడ్జీ విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మానసిక ఉల్లాసానికే క్రీడలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ అన్నారు. జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండులో 31వ వార్షిక జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్‌మీట్ కార్యక్రమం శనివారంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై, మాట్లాడారు. పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ క్రీడలు ఉద్యోగుల్లో మంచి స్ఫూర్తిని నింపాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాగావళి నీటి చౌర్యంపై ఫిర్యాదు

రేగిడి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సంకిలి గ్రామంలో నాగావళి నది నుంచి స్థానిక ఐఐడీ ప్యారీ సుగర్స్ కర్మాగారానికి జల చౌర్యానికి పాల్పడుతున్నట్లు సర్పంచ్ పట్టాబి, పాలకవర్గ సభ్యులు, అప్పాపురం మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు రాష్ట్ర జల వనరుల శాఖ ఇంజినీరింగ్ చీఫ్, ఇతర అధికారులకు ఫిర్యాదుచేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంపై వీరు అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటి చౌర్యంపై అధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిర్యాదు ప్రతులను శనివారం స్థానిక విలేకర్లకు అందించారు. నిర్దేశిత గంటలకు మించి రోజుంతా నీటిని తరలించి నాగావళి దిగువ గ్రామాలకు నీటి కొరతకు కారణం అవుతున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

రేగిడి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, ఇతర మత్తు పానీయాలకు యువత దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజం లక్ష్యం కావాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర పేర్కొన్నారు. మండలంలో ఉంగరాడలో శనివారం సంకల్పం పేరుతో రాజాం రూరల్ సీఐ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై చైతన్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

బొబ్బిలి ఏవోగా మధుబాబు

తెర్లాం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కొరటాం సచివాలయంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మధుబాబు బొబ్బిలి మండల వ్యవసాయ అధికారిగా నియమితులయ్యారు. ఆయన సొంత గ్రామం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురం.

విద్యుత్ భారం తగదు

బొబ్బిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల అవినీతి కుంభకోణాల పర్యవసానంగా విద్యుత్ వినియోగదారులపై వేల కోట్ల భారం మోపడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శంకరరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే విద్యుత్ చార్జీల పెంపుదలను నిలుపుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో గోపాలం, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



గుమ్మలక్ష్మీపురం: పి.ఆమిటిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి, ట్రైకార్ డైరక్టర్ లావణ్య



తెర్లాం: కుసుమూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన

టీడీపీతోనే సంక్షేమం

» మంత్రులు అనిత, శ్రీనివాస్ » జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రారంభం

» పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు



బాడంగి: పింఛన్ అందజేస్తున్న బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు

సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభమయ్యింది. సచివాలయ అధికారులు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము పంపిణీ చేశారు. పలు చోట్ల ఎమ్మెల్యేలు, నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆమె శనివారం నెల్లిమర్లలో పింఛన్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఆరో వార్డులో పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. తొలుత స్థానిక నాయకు లంతా ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, కలెక్టర్ అంబేడ్కర్, టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, కంది చంద్రశేఖర్, మహంతి చిన్నంనాయుడు, లెంక అప్పలనాయుడు, లెంక హైమావతి, ఆల్తి శ్రీనివాసరావు, గేదెల రాజారావు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రులు అనిత, శ్రీనివాస్, ఎమ్మెల్యే నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

రహదారుల విస్తరణకు తీర్మానం

● బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలో పురాతనమైన నిర్మాణాలు కలిగిన వీధుల్లో రహదారుల వెడల్పును పెంచుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు అధ్యక్షతన శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో రోడ్ల వెడల్పు తక్కువ ఉన్న ప్రాంతాల్లో ఇక మీదట ప్లాన్ల మంజూరుకు వెసులుబాటు కల్పిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. మున్సిపల్ వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ అడిగిన ప్రశ్నకు టౌన్‌ప్లానింగ్ అధికారి రోహిణి పూర్తి వివరణ ఇచ్చారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.78.80లక్షలతో 14 పనులకు, అన్‌టైడ్ గ్రాంటు రూ.82 లక్షలతో 17 పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. టైడ్ గ్రాంటు రూ.1.23 కోట్లు, రూ.1.18 కోట్లతో అమృత్ 2.0 పనులకు ఆమోదం తెలిపారు. పలు వార్డుల్లో పనుల కేటాయింపునకు సంబంధించి టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు రాంబార్కి శరత్‌బాబు, ఇంటి గోవిందరావుల మధ్య వాగ్వాదం జరిగింది. సభ్యులు అడిగిన అనేక సందేహాలకు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, డీఈఈ కిరణ్ సిబ్బంది వివరణ ఇచ్చారు. వైస్ చైర్మన్ గొలగాని రమాదేవితో పాటు వివిధ వార్డుల కౌన్సిలర్లు ఆయా వార్డుల్లోని సమస్యలను ప్రస్తావించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజరు దీక్షితులు, ఆర్వో నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు, టీపీఆర్వో జగన్మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి పాల్గొన్నారు.



టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

జిల్లా రోడ్డు రవాణా భారమంతా బొబ్బిలి పైనే..

● ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రోడ్డు రవాణా భారమంతా బొబ్బిలి నియోజకవర్గంపై తీవ్రంగా పడడంతో మొత్తం రోడ్లన్నీ చాలా ఛిద్రమైపోయాయని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత అధ్యక్షతన శనివారం విజయనగరంలో జరిగిన సమీక్షా సమావేశంలో బొబ్బిలి ప్రాంత సమస్యలను ఎమ్మెల్యే ఏకరువు పెట్టారు. పారాది వంతెను కుంగిపోవడంతో అంతర్రాష్ట్ర రహదారిలో ప్రయాణించే భారీ వాహనాలన్నీ గ్రామీణ ప్రాంతాల రహదారులపై వెళ్లడంతో బొబ్బిలి, తెర్లాం, బాడంగి రోడ్లు పూర్తిగా పాడైపోయాయన్నారు. పారాది వంతెన నిర్మాణాన్ని వచ్చే వర్షాకాలంలోగా పూర్తి చేయకపోతే చాలా సమస్యలు ఎదురవుతాయన్నారు. ఏపీఐఐసీ గ్రోత్ సెంటరులో పరిశ్రమల ఏర్పాటు, ఇతర సమస్యలకు సంబంధించి ప్రత్యేక సమీక్ష నిర్వ హించాలని, అక్కడ పరిస్థితులన్నిటినీ చక్కదిద్దాలని ఆయన కోరారు. వీటన్నిటిపై ఇన్‌చార్జి మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజావేదికలో అర్జీలు స్వీకరించిన సుజయ్

బొబ్బిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజావేదికలో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఆర్వీ సుజయ్‌కృష్ణరంగారావు పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఈయన అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

● వ్యవసాయ శాఖ జేడీ రామారావు

బొండపల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): వరి రైతులు తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు సూచించారు. మండలంలోని గరుడుబిల్లిలో వరి నూర్పులు చేసి, మిల్లులకు తరలించడానికి సిద్ధంగా ఉన్న ధాన్యంబస్తాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్టుగా వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండి వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. తుఫాను ప్రభావం మూడు రోజులపాటు ఉండే అవకాశం ఉన్నందున రైతులు ఎవ్వరూ కోతలు కోయవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఏవో పీవీ.మల్లిఖార్జునరావు, రైతు సేవా కేంద్రం సహాయకుడు అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ



ఎస్.కోట: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహ పాఠశాల, వెనబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యాప్రమాణాలను పరిశీలించారు. వసతి గృహాల్లో అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. బీసీ వసతి గృహ కిటికీలకు మెస్, ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల స్టడీ క్లాస్‌కు అవసరమగు తార్పాన్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బుజ్జి, మజ్జి గంగరాజు, కోట్యాడ జగదీష్ తదితరులున్నారు. ● కొత్తవలస: తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలో నున్న కస్తూర్బా పాఠశాలను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలందరూ వచ్చే పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఈసందర్భంగా పాఠశాల మెనూతో పాటు, వంటశాలను, బాత్ రూంలను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీటీసీ వేలమూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కైలాసనాథునికి మహా రుద్రాభిషేకం



పూజల్లో పాల్గొన్న భక్తులు

లక్కవరపుకోట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): లచ్చంపేట గ్రామంలో శనివారం కైలాసనాథునికి మహారుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. పండితులు ఎస్.మధుకుమార్‌శర్మ ఆధ్వర్యంలో అరసవల్లి, బరంపురం నుంచి వేదపండితులు హాజరై కాశీ నుంచి తీసుకువచ్చిన 101 శివలింగాలకు సామూహిక రుద్రాభిషేకాలు చేశారు. అరసవల్లి దేవస్థానం పండితులు హరిసూర్యనారాయణశర్మ, బ్రహ్మపురం చౌడేశ్వరీదేవి ఆలయం పండితులు ఉమా మహేశ్వర శర్మ, ఎన్.బాలకృష్ణశర్మ సోదురులు పాల్గొని అభిషేకాలు నిర్వహించారు.

ఏకగ్రీవంగా బడ్జెట్ ఆమోదం

బాడంగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ బోగి గౌరీ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం శనివారం నిర్వహించారు. సభ్యుల తీర్మానం కోసం బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారు. కాగా 2024-25 సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ.38లక్షల 52వేల 656, అలాగే రాబడి రూ.81కోట్ల 56లక్షల 30వేలు.. వెరసి రూ.81కోట్ల 94లక్షల 82వేల 656, ఇందులో ఖర్చులు రూ.81కోట్ల 2లక్షల 32వేలుగా నిర్ణయించారు. అంచనా నిల్వగా రూ.92లక్షల 50వేల 656 తీసుకుని 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీనిలో రాబడులు రూ.88కోట్ల లక్షా 45వేలు చూపించగా దీంట్లో ఖర్చులు రూ.87కోట్ల 43లక్షల 500గా అంచనా వేశారు. ఈ బడ్జెట్‌ను అంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ, ఏవో తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

బొబ్బిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ఈ ఏడాది నవంబరు నుంచి 135 నెలలు పూర్తి చేసుకున్న వారందరికీ పూర్తి స్థాయి పెన్షన్లు పొందేవిధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఆ సంఘం రాష్ట్ర నేత రౌతు రామ్మూర్తి అన్నారు. శనివారం స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి లచ్చుపతుల జగన్నాథం, సహ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి రెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల అడ్డగింత

భోగాపురం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో టీడీపీకి చెందిన సర్పంచ్ ఉన్నా వారికి పనులు ఇవ్వకుండా జనసేన కార్యకర్తలకు ఏవిధంగా పనులు అప్పగిస్తారంటూ టీడీపీ నాయకులు బుగత రామ్మోహన్, కార్యకర్తలు బర్ల శ్రీను, ఓదూరి నరిశింహులు, స్థానికులు సీసీ రహదారి నిర్మాణ పనులు అడ్డుకున్నారు. శనివారం మండలం లింగాలవలస గ్రామంలో పల్లెపండగలో భాగంగా ఉపాధిహామీ పథకం ద్వారా సీసీ రహదారి నిర్మాణ పనులు జనసేన కార్యకర్తలు ప్రారంభించారు. అయితే విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు జేసీబీని పనులు చేయనివ్వకుండా అడ్డుకున్నారు. పంచాయతీలో జనసేన కార్యకర్తలకు ఏవిధంగా అభివృద్ధి పనులు అప్పగిస్తారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అంటున్నారే తప్ప ఆ దిశగా జనసేన నియోజకవర్గ నాయకులు, ఎమ్మెల్యే నడుచుకోవడం లేదన్నారు. అనంతరం పనులు నిర్వహించడానికి అవకాశం లేకపోవడంతో జేసీబీని అక్కడ నుంచి తీసుకువెళ్లిపోయారు.

మహాకవికి నివాళి

● జిల్లాలో గురజాడ వర్ధంతి

మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా శనివారం విజయనగరం జిల్లాలో పలుచోట్ల ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ గురజాడ తన రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, సాంఘిక పరివర్తనకు కృషి చేశారని కొనియాడారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం: విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో నివాళులు అర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు రంగరాజు, అశోక్



మెంటాడ: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



రామభద్రపురం: నాయుడువలస ప్రాథమిక పాఠశాలలో..